1

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | ఏప్రిల్ 11, 2025 | www.navatelangana.com

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-లింగంపేట్


మహిళా సంఘాలు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదిగి పురుషులతో పోటీ పడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాగ్వాన్ అన్నారు. గురువారం మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సగం మహిళా సంఘాలకు కేటాయించాలని తెలిపిన మేరకు జిల్లాలో 183 కేంద్రాలు మహిళా సంఘాల ద్వారా కొనుగోళ్ల చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ముస్తాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 149 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఇళ్ల స్థలం ఉండి అర్హత కలిగిన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి మార్క్ అవుట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డ్ అందేవిధంగా వెరిఫికేషన్ చేయాలనీ కార్యదర్శులకు సూచించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యక్తి అర్ధనగ్న ప్రదర్శన



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని పోచారం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గురువారం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టాడు. తన తండ్రి నుంచి వారసత్వంగా మాల్‌తుమ్మెద శివారులో వచ్చిన ఎకరం 29 గుంటల భూమిని తన అన్న బాపూరావు కొన్ని సంవత్సరాల నుంచి తానే పంట పండించుకుంటూ ఆ భూమిలోకి అడుగుపెట్టనివ్వడం లేదంటూ బాధితుడు శ్రీనివాసరావు పేర్కొన్నాడు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొన్నాడు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. వారసత్వం కలిగిన భూమి కుటుంబ తగాదాలు ఉండడం వల్ల సివిల్ కోర్టుకు వెళ్లాలని సూచించామని తహసీల్దార్ తెలిపారు.



రోజువారి కష్టం.. మద్యానికి సమర్పణం

- గ్రామాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- మద్యానికి బానిసవుతున్న యువత
- పచ్చని కుటుంబాల్లో మద్యం చిచ్చు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలు, 526 గ్రామపంచాయతీలున్నాయి. జిల్లావ్యాప్తంగా 49 వైన్స్‌లున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లు ఎనిమిది ఉన్నాయి. ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవడానికి గ్రామాలలో మద్యం ఎక్కువగా విక్రయించాలని ప్రోత్సహించడం ఒకవైపు అయితే.. కొన్ని గ్రామాల్లో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి పేరుతో టెండర్లు వేసి బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు.

ఆదాయాన్ని పెంచుకోవడానికి..

ప్రస్తుతం కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాప్ లేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. జిల్లా వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో ఒక్కో బెల్ట్‌షాపు ఉండగా.. మరికొన్ని గ్రామాల్లో రెండు నుంచి నాలుగు వరకు బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. దీనిని బట్టి జిల్లా వ్యాప్తంగా సుమారు 600కు పైగానే బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు తమ టార్గెట్ నింపుకోవడానికి పచ్చని పల్లెలను వదలడం లేదు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ వైన్స్ షాప్‌ల టార్గెట్ నింపేందుకు ఏ గ్రామంలో బెల్ట్ షాపులో మద్యం తక్కువ అమ్మినా.. ఆ షాప్ యజమానికి ఫోన్ చేసి మద్యం తక్కువగా ఎందుకు అమ్ముతున్నారు..? అంటూ ఎక్సైజ్ అధికారులే అడుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రామాలలో మద్యం విక్రయాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

> గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. దీంతో యువకులు మద్యానికి బానిసవడంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఆదాయం వస్తే చాలు అన్న విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బెల్ట్‌షాపులు నిర్వహించకుండా చూడాల్సిన ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం గమనార్హం. రోజంతా కాయకష్టం చేసి వచ్చిన డబ్బులతో కుటుంబాలు పోషించుకుంటున్న గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి చిచ్చు పెడుతున్నారు బెల్ట్‌షాపు నిర్వాహకులు. ధనార్జనే ధ్యేయంగా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. యువతలో చైతన్యం వెల్లివిరిస్తేనే బెల్ట్ షాపుల విస్తరణకు ముకుతాడు వేయొచ్చుననే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

మద్యానికి రోజువారీ కష్టం..

ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహించడంతో పేద ప్రజల రోజు వారి కష్టం మద్యానికి సమర్పణం అవుతుంది. వివిధ గ్రామపంచాయతీలలో పేద ప్రజల ఆదాయంలో 90 శాతం మద్యానికి వెచ్చిస్తున్నారని వివిధ గ్రామాల మహిళలు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీ పరిధిలోని బెల్ట్ షాపులలో ఉదయం 10 నుంచి మద్యం ప్రియులు మద్యం సేవిస్తుంటారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. దీనిని అరికట్టడంలో అటు ఎక్సైజ్ శాఖ కానీ, ఇటు పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీని ద్వారా గ్రామాలలో పేద కుటుంబాలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడుతున్నాయి. మద్యంమత్తులో పలువురు గ్రామాలలో గొడవలు దిగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఎవరైనా ప్రత్యేకించి మద్యం తాగాలంటే దూర ప్రాంతాలకు వెళ్లలేరు. స్థానికంగా దొరకడంతో ఎప్పుడు పడితే అప్పుడు గ్రామస్తులు మద్యాన్ని సేవించడంతో వారూ ఆర్థికంగా ఎదగలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బెల్ట్ షాపులను నివారించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



యువకుల్లో చైతన్యం రావాలి..

యువకుల్లో చైతన్యం రానంత కలం గ్రామాలలో పేద ప్రజల జీవితాలు మారవు. మద్యానికి దూరంగా ఉండాల్సిన యువకులే మద్యానికి బానిసై

బతుకులను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మద్యం సేవించడం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబం ఇబ్బందికర పరిస్థితుల్లోకి వెళ్తుందన్న సంగతిని నేటి యువత మరిచి ఇష్టానుసారంగా మద్యాన్ని సేవిస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఏదో ఒక విధంగా మద్యం సేవించడానికి అలవాటు పడిపోతున్నారు.

గ్రామాభివృద్ధి పేరుతో వేలం పాట..

సుమారు ప్రతి గ్రామంలో కొందరు పెద్దమనుషులు కలిసి గ్రామ అభివృద్ధి పేరుతో బెల్ట్ షాపుల టెండర్ వేసి ఆ టెండర్ ద్వారా వచ్చే డబ్బులను గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని చెప్తున్నారు. ఆ డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో ఆ గ్రామంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఆలోచించలేకపోతున్నారు.

ప్రజల్ని తాగుడుకు బానిసల్ని చేయొద్దు



ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు దేవుడెరుగు. కానీ గ్రామాలలో ప్రజల్ని మాత్రం ఆదాయం కోసం తాగుడుకు బానిస చేయొద్దు. ప్రతి గ్రామంలో ఒకటి, రెండు, గ్రామం పెద్దగా ఉంటే మూడు ఇలా బెల్ట్ షాప్‌లను విస్తరింపజేసి ప్రతి వ్యక్తి తాగుడుకు బానిసయ్యేలాగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రోజంతా కూలి నాలీ చేసుకున్న డబ్బులను ఇంట్లో గొడవలు పెట్టుకుని మరి తాగుడుకు తగిలిస్తున్నారు. తద్వారా ఆ కుటుంబం ఆర్థికంగా ఎదగలేకపోతోంది. వారి పిల్లల్ని సైతం ఉన్నత చదువులను చదివించలేక చదువులు మాన్పించే స్థితికి కుటుంబాలు దిగజారుతున్నాయి.

– సుజాత, రామారెడ్డి

కుటుంబాలు రోడ్డున పడుతున్నాయ్



గ్రామాల్లో నిర్వహించే బెల్ట్ షాపుల వల్ల 90 శాతం మంది కూలీ పని చేసుకుని జీవించే వ్యక్తుల కుటుంబాలే రోడ్డున పడుతున్నాయి. చేతిలో డబ్బు ఉంటే రేపటి గురించి ఆలోచించకుండా ఉదయం మధ్యాహ్నం మద్యాన్ని సేవిస్తూ ఇంట్లో భార్యను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఏ ప్రభుత్వం మారినా ఈ బెల్ట్ షాపులను అరికట్టలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాలలో గల బెల్ట్ షాపులను తొలగించాలి.

– ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి

జుక్కల్‌లో భారీ వర్షం

- బస్వాపూర్‌లో వడగండ్లు..
- పలు గ్రామాల్లో చిరుజల్లులు
- వరి పంటకు నష్టం

నవతెలంగాణ-విలేకరుల బృందం

జుక్కల్ : మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. బస్వాపూర్ గ్రామంలో వడగండ్ల వాన కురవడంతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. అలాగే పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన చిరుజల్లుల వర్షం కురిసింది. ఈదురుగాలులకు రేకులు ఎగిరిపడ్డాయి. బస్వాపూర్ గ్రామంలో వడగండ్ల వాన పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొంతమంది రైతులు యాసంగి వరి పంటను కోత కోసి రోడ్డు పక్కన ఆరబెట్టారు. ఇంకొంతమంది రైతులు కోయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురవడంతో నష్ట వాటిల్లింది. కోతకు వచ్చిన వరి పంట నేలవాలడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.



జుక్కల్ : బస్వాపూర్‌లో వడగండ్లు

చిరుజల్లులు..

ఎడపల్లి : ఎడపల్లి మండలంలో ఈదురుగాలులతో కూడిన చిరుజల్లుల వర్షం కురిసింది. సుమారు నాలుగున్నర గంటల ప్రాంతంలో చిరుజల్లులు కురవడంతో రైతులు పలుచోట్ల ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పలు చేయడానికి అనేక కష్టాలు పడ్డారు. మండలంలో సుమారు 20శాతం మంది రైతులు ధాన్యాన్ని విక్రయించగా.. ఇంకా 80శాతం మంది రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టారు. ఆకాశం మేఘావృత్తమవడంతో ఆందోళన చెందుతున్నారు.

సదాశివనగర్ : మండలంలో ఉదయం నుంచే ఆకాశం మేఘావృతం అవడంతో రైతులు ఆందోళన చెందారు. మండలంలోని కొంతమంది రైతుల వరి పంట చేతికొచ్చే దశలో ఉంది. మరికొందరి రైతులు ఇప్పటికే వరి కోసి కల్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టారు. మొక్కజొన్న చేతికొచ్చిన రైతులు సైతం ఆందోళన చెందుతున్నారు.



ఎడపల్లి మండలంలో ధాన్యం టార్ఫాలిన్ కప్పుతున్న రైతు

చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు

- సీపీ సాయిచైతన్య
- హనుమాన్ జయంతి ర్యాలీ ఆర్గనైజర్లతో సమన్వయ సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ సాయిచైతన్య అన్నారు. ఈనెల 12న శనివారం నగరంలోని కంఠేశ్వర్ నుంచి ఆర్ఆర్ చౌరస్తా వరకు జరగనున్న హనుమాన్ జయంతి ర్యాలీ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య కమాండ్ కంట్రోల్ హాల్‌లో హనుమాన్ ర్యాలీ నిర్వహకులతో, వివిధ సంఘాలతో గురువారం సమావేశం నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా పాటించవలసిన నియమ నిబంధనలు, చేయవలసినవి, చేయకూడనివి వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ర్యాలీ సమయంలో ఇతరులకు, సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అన్నారు. డ్రోన్లను నిషేధిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్య సమాజ్, ఏబీవీపీ, హిందువాహిని తదితరులు పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ సాయి కిరణ్ పత్తిపాక, అదనపు పోలీస్ కమిషనర్ (స్పెషల్ బ్రాంచ్) శ్రీనివాస్ రావ్, ఇంచార్జి అదనపు డిసిపి (అడ్మిన్) మస్తాన్ అలీ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నిజామాబాద్ రాజా వెంకట్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష

- రూ.2వేల జరిమానా.. బాధితురాలికి రూ.2లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు

నవతెలంగాణ-నిజాంసాగర్



ఆరేండ్ల మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన షేక్ షాదుల్ అనే వ్యక్తికి ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి (ఫోక్సో) లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించి, బాధితురాలికి రూ.2లక్షల నష్టపరిహారం ఇవ్వాలని గురువారం తీర్పునిచ్చినట్టు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌నగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన షేక్ షాదుల్ 16.01.2021వ తేదీన మైనర్ బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో బాధితురాలు, ఆమె చెల్లెలు, స్నేహితురాలితో గ్రామంలోని ప్రకృతి వనంలో ఆడుకుంటుండగా నిందితుడైన షేక్ షాదుల్ బాధితురాలికి చెరుకు గడ ఇస్తానని చెప్పి ఇంట్లోకి పిలిచి లైంగికదాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న బాధితురాలి చెల్లి, స్నేహితురాలు.. అక్క అక్క అని అరవగా నిందితుడు వారి చెంపపై కొట్టి పారిపోయాడు. బాధితురాలి తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నుంచి ఇంటికి రాగానే జరిగిన విషయం వారికి తెలుపగా బాధితురాలి తల్లి వెంటనే నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించడంతో జడ్జి శిక్ష విధించారు. కోర్టు కానిస్టేబుల్ కిషన్, ప్రస్తుత ఎస్ఐ జె.శివకుమార్, సీఐ రాజేష్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

ప్రజా పోరాటాలకు ఆద్యుడు.. జైనుద్దీన్

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు
- గోవూరులో జైనుద్దీన్ సంస్మరణ సభ

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని గోవూర్ గ్రామంలో పాలేర్లకు తక్కువ జీతం ఇచ్చి, శ్రమ దోపిడీకి పాల్పడుతున్న భూస్వాముల మీద తిరుగుబాటు చేసిన పోరాట వీరుడు కామ్రేడ్ జైనుద్దీన్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు కొనియాడారు. గురువారం గోవూరు గ్రామంలో జైనుద్దీన్ సంస్మరణ సభను బొర్ర సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలను, సేవలను వక్తలు కొనియాడారు. పాలేర్ల సమస్యలపై పోరాడుతూనే, పేదోడి బతుకు మార్పునకు భూమి ఒక్కటే మార్గమని నిజాంషుగర్ ఫ్యాక్టరీ ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని భూ పోరాటం చేపట్టారన్నారు. భూ పోరాట ఫలితంగా ఆనాటి ప్రభుత్వం దిగివచ్చి, గ్రామంలో నిరుపేదలకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున 400 మందికి భూ పంపిణీ చేసిందని తెలిపారు. ఇండ్ల స్థలాలు లేని పేద ప్రజలకు ఇంటి స్థలంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని పోరాటం చేయగా సుమారు 120 మందికి ఇండ్లు వచ్చాయని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు శ్మశాన వాటిక లేకపోవడంతో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ప్రజలతో కలిసి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కరించగలిగారని తెలిపారు. సామాజిక రుగ్మతలపై ఆయన పోరాటం చేసి గ్రామంలో కొనసాగుతున్న కుల వివక్ష, రెండు గ్లాసుల పద్ధతిపై మార్పు రావాలని సామాజిక పోరాటం చేసి, ప్రజల్లో చైతన్యం నింపిన చైతన్య దీపిక అని కొనియాడారు. కష్టాల్లో ఉన్న కష్టజీవుల కోసం, కడజాతి ప్రజల కోసం చిమ్మచీకట్లో వెలిగే వేగుచుక్క లాంటివాడని, ఆయన పోరాట పటిమ పార్టీ కార్యకర్తలకు, యువతకు ఆదర్శనీయమని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సంస్మరణ సభలో సీనియర్ నాయకులు గంగాధరప్పా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నన్నేసాబ్, యేశాల గంగాధర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, పార్టీ ఏరియా నాయకులు బొర్ర గంగాధర్, ఎర్ర పర్వయ్య, మహమ్మద్‌ఖాన్, నర్సయ్య, గంగవ్వ లక్ష్మణ్, రాములు, సాయిలు, ముత్తు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

దుబాయ్ నుంచి వచ్చిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్

- తల్లి అంత్యక్రియల కోసం బోధన్‌కు..
- ఎయిర్‌పోర్టుకు తరలివెళ్లిన గులాబీ నేతలు
- పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హైకోర్టు ఆదేశాల మేరకే తదుపరి చర్యలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పలు కేసుల్లో పరారీలో ఉన్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత దుబాయి నుంచి ఇండియాకు వచ్చారు. ఆయన గురువారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి నేరుగా బోధన్‌కు వెళ్లారు. అక్కడే పోలీసులు ఆయన్ను అరెస్టు చేస్తారని ప్రచారం జరిగింది. దీంతో బీఆర్ఎస్ నేతలు, ఆయన అనుచరులు పెద్దసంఖ్యలో ఎయిర్‌పోర్టుకు తరలివెళ్లారు. షకీల్ తల్లి శాగుఫ్తా ఆదిబ్(70) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. దీంతో ఆమె అంత్యక్రియలకు హాజరయ్యారు.



తల్లి నుదుటిని ముద్దాడుతున్న ఎమ్మెల్యే

వివరాలు మెయిన్‌లో..

వేగంగా ధాన్యాన్ని సేకరించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్/జక్రాన్‌పల్లి

అకాల వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నందున రైతుల నుంచి వేగవంతంగా ధాన్యం సేకరిస్తూ, వెంటదివెంట నిర్దేశించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని మంథని, జక్రాన్‌పల్లి మండలంలోని కేశ్‌పల్లి గ్రామాలతో పాటు మోర్తాడ్ మండల కేంద్రంలో ఐకెపి మహిళా సంఘాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం తూకంలో ఏమైనా తేడాలు ఉంటున్నాయా అని ప్రశ్నించగా, ఒక్కో బస్తాకు 41.5 కిలోల చొప్పున తూకం జరుపుతున్నారని రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిలువ చేసిన ధాన్యం రాశులను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. గ్రెయిన్ క్యాలిపర్ ద్వారా నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా సన్న ధాన్యం ఉందా లేదా అని కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపారు. మంథని గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న ధాన్యం అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయి మద్దతు ధర పొందాలని, సన్న ధాన్యానికి అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతోందని గుర్తు చేశారు. ఇసుక, మట్టి బెడ్డలు, సేంద్రీయ పదార్థాలు, పొట్టు, తాలుగింజలు వంటివి లేకుండా, తేమ 17 శాతానికి మించకుండా ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా పూర్తిస్థాయిలో రైతులకు మద్దతు ధర అందడమే కాకుండా, రైస్ మిల్లుల వద్ద కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని కలెక్టర్ హితవు పలికారు. కాగా, కొనుగోలు కేంద్రాల వద్ద మాయిశ్చర్ యంత్రాలు, టార్పాలిన్లు, వెయింగ్ మెషిన్లను సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉంచాలని అన్నారు. సన్నాలు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తున్నందున గత సీజన్‌తో పోలిస్తే ఈసారి యాసంగిలో 80 శాతానికిపైగా సన్న రకం ధాన్యం పండించారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లను వేగవంతం చేస్తూ, నిర్దిష్ట గడువుకు ముందే ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటదివెంట బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల నుంచి ఎప్పటికప్పుడు ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. రైతుల నుండి ధాన్యం కొన్న వెంటనే వారికి పూర్తి వివరాలతో కూడిన రసీదును తప్పనిసరిగా అందించాలని, ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను కూడా సంబంధిత రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇంచార్జ్ డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజాగౌడ్, డీసీఓ ఎన్.శ్రీనివాస్‌రావు, డీఎస్ఓ అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధరలను తగ్గించకుంటే పోరాటం

- పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే ఉపసరించుకోవాలి
- ప్రజలపై భారాలను ఆపాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్
- ఆటోకు తాడుకట్టి లాగుతూ నిరసన



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారమవుతున్నాయని.. వెంటనే పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోకు తాడుకట్టి లాగుతూ నిరసన తెలిపారు.

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 11, 2025 | www.navatelangana.com

లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కుల అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కృషితో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక సహాయం చేకులను అందజేశారు. గ్రామానికి చెందిన చేర్లపల్లి లతకు రూ.14వేలు, ఏలాల అరుణ్ కు రూ.27వేల ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులు ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం చెక్కులను మంజూరు చేయించారు. గురువారం అట్టి చెక్కులను స్థానిక బిఆర్ఎస్ నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నవీన్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ మారు శంకర్, తాజా మాజీ ఎంపిటిసి సభ్యుడు ఏషాల నర్సయ్య, నాయకులు రాజేందర్, లింగారెడ్డి, ఎలాల శంకర్, సామర మురళి, సత్యనారాయణ, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


నివాళ్లు అర్పిస్తున్న బాజిరెడ్డి జగన్, నాయకులు

ఇటీవల మరణించిన మండలంలోని మనోహరాబాద్ ఉపసర్పంచ్ రోడ్డు సురేష్ కుటుంబాన్ని జిల్లా మాజీ ఆర్థిక ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ పరామర్శించారు. ఆయనతో పాటు టిఆర్ఎస్ నాయకులు పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మండల్ పార్టీ అధ్యక్షులు నట భోజన, మాజీ ఎంపీపీ దీకొండ శ్రీనివాస్, మాజీ సర్పంచులు ఆర్ గంగాధర్, మాదర్ దేవరాజ్, సురేష్, గ్రామ శాఖ అధ్యక్షులు అల్లూరు మైపాల్, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్, ఆర్ బాబయ్య తదితరులు తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండోర్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్


ఎన్నికైన లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండోర్ కార్యవర్గం

నిజామాబాద్ నగరంలోని సందీప్ గార్డెన్స్‌లో 2025-26 సంవత్సరానికి గానూ లయన్స్ కబ్ ఆఫ్ ఇందూర్ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. లయన్స్ రీజియన్ చైర్మెన్ పి.లక్ష్మినారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా అబ్బాయి లింబాద్రి, కార్యదర్శిగా పెట్టిగాడి రాఘవేందర్, కోశాధికారిగా అంకం రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చెన్న రవీంద్రనాథ్ గుప్త,పెట్టిగాడి శ్రీనివాస్, ఎల్.సి.ఎఫ్ కో-ఆర్డినేటర్ గా ఇరుమల శివలింగం,మార్కెటింగ్ చైర్మెన్ గా చింతల గంగాదాస్ జీఎస్టీ కో ఆర్డినేటర్‌గా దాసరి రాఘవేందర్‌ను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా డాక్టర్ డీఎల్ఎన్ స్వామి, రావి నేతాజీ, గడ్డం రామకృష్ణారెడ్డి, షేక్ బాషా, డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్, గర్దాస్ శంకర్, డాక్టర్ అంకం గణేష్, డాక్టర్ కృష్ణమూర్తి పవార్, కె.వెంకటేష్, డాక్టర్ జమాల్పూర్ రాజశేఖర్ ఎన్నిక య్యారు. లయన్స్ సేవలను మరింత విసృత పరుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నూతన అధ్యక్షులు అబ్బాయి లింబాద్రి పేర్కొన్నారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్
- అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మున్సిపల్ కార్పొరేషన్ ఔట్సోర్సింగ్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దండి వెంకట్ మాట్లాడుతూ.. పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్1936 ప్రకారం ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతినెల 5వ తారీకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కానీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఔట్సోర్సింగ్ శ్రీ కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టర్ శరత్ ప్రతినెల వేతనాలు సకాలంలో చెల్లించక పోవడంతో కార్మికులు వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురైతున్నారని అన్నారు. కావున నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 680 మంది కార్మికులు శ్రీ కార్తికేయ ఏజెన్సీ ద్వారా పని చేస్తున్నారని తెలిపారు. కావున వీరికి ప్రతినెల 5న గతంలో లాగే వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, రాహుల్, హరీష్, మురళి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

- ఆరుగురికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

డ్రంక్ అండ్ డ్రైవ్ లో ముగ్గురికి జైలు శిక్ష పడగా ఆరుగురికి జరిమానా విధించామని నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్ గురువారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపిన 9 మందికి ట్రాఫిక్ ఏసిపి నారాయణ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జాన్ ముందు హాజరపరచగా ఆరుమందికి 11వేల జరిమానా విధించి, మరో ముగ్గురు అంబేద్కర్ కాలనీకి చెందిన లోకి శివకుమార్, ---నాందేవ్‌వాడకు చెందిన ఐలాపురం శ్రీకాంత్, నాందేడ్‌కు చెందిన అతులకు రెండు రోజుల జైలు శిక్ష పడిందని సిఐ తెలిపారు. కావున ట్రాఫిక్ ఏసిపి నారాయణ మాట్లాడుతూ.. వాహనదారులకు తాగి నడపరాదని లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

వరంగల్ (ఎల్కతుర్తి)లో ఈనెల 27 జరగనున్న బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల ఆవిర్భావ బహిరంగ సభను " విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజవంతం చేయాలని గ్రామశాఖ అధ్యక్షులు ఎంబరి శరత్ కుమార్ కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ మానేటి నాగభూషణం, మాజీ ఎంపీటీసీ రాంరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు షేక్. రహిమొద్దీన్, అశోక్, శివప్రసాద్, ప్రసాద్,రమాకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం వ్యవస్థాపకుడు కామ్రేడ్ జార్జ్ రెడ్డి 53వ వర్ధంతి సభలను ఈనెల 10 నుంచి 14 వరకు జరపాలనీ ఆసంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ జార్జ్ రెడ్డి 53 వర్ధంతి పోస్టర్స్ గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ మాట్లాడుతూ.. కామ్రేడ్ జార్జి రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో ర్యాగింగ్ పేరుతో గ్రామీణ పేద విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తూ వాళ్లను విద్యకు దూరం చేస్తున్న పరిస్థితుల్లో వారికి అండగా పోరాటం చేశాడు. మరోవైపు మతోన్మాదానికి వ్యతిరేకంగా, మహిళలపై జరిగే లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ, విద్యార్థి నాయకులు కామ్రేడ్ జార్జి రెడ్డి అని అన్నారు. క్యాంపస్ లో జరుగుతున్న అన్యాయాలను, గుండాల దాడులను ఎదిరించి విద్యార్థులకు అండగా నిలబడ్డారని అన్నారు. ఇది జీర్ణించుకోలేని మతోన్మాద గుండాలు జార్జి రెడ్డిని హత్య చేశారన్నారు. ఆయన ఆశయాల సాధనకై విద్యార్థులు పోరాడాలని, ఆయన అమరత్వాన్ని స్మరించుకుంటూ ఈ నెల ఏప్రిల్ 10 నుండి 14 తేది వరకు వర్ధంతి సభలను ఘనంగా జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధక్షులు హుస్సేన్, నాయకులు రాహుల్, సాయి, పవన్, రహమాన్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీట్ ఉన్న వారిపై నిఘా

- సత్ప్రవర్తనతో ఉంటే రౌడీ షీట్ ఎత్తివేస్తాం
- రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేకంగా నిఘా
- మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తాం
- పిడి యాక్ట్ అమలు చేస్తాం
- రౌడీషీటర్స్ కౌన్సిలింగ్ లో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట రెడ్డి



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ రాజావెంకటరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై పోలీసుల నిఘా ఉంటుందని, మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తామని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ నిజామాబాద్ 5వ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు కోసం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏసీపీ రౌడీషీటర్ల నేర చరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఇప్పటి నుండి రౌడీ షీటర్స్ ఉన్న వారి పేర్లు గాని, మోహాలు గాని ఎలాంటి కేసులోనైనా, గ్రూపు తగాదాల్లోనైనా ఎవరి ప్రోద్భలంతోనైనా ఎవరైనా ఫోన్లలో చెప్పడం వల్ల గాని నేరాల్లో పాలుపంచుకోకూడదని అన్నారు. ఈ కౌన్సిలింగ్‌కు హాజరైన వారిలో ఎవరైనా భవిష్యత్తులో నేరాల్లో పాలుపంచుకుంటే చట్టప్రకారం శాశ్వతంగా జైలు జీవితం గడప వలసి వస్తుందని ఏసిపి హెచ్చరించారు. కౌన్సిలింగ్ నిర్వహించడానికి ప్రధాన కారణం నేర ప్రవృత్తిని విడిచి కుటుంబ సభ్యులతో కలిసి జీవన ఉపాధి ఏర్పరచుకొని సత్ప్రవర్తనతో మెలగడంకోసమని అన్నారు. చెప్పిన మాటలు విని, చట్ట వ్యతిరేకమైన కార్యకరలాపాలకు పాల్పడితే జైలు పాలు అవడం తప్పదని అన్నారు. రౌడీ షీటర్లను ప్రత్యేకంగా ప్రతిరోజు పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం, ఇండ్లను సందర్శించి చెక్ చేయడం జరుగుతుందన్నారు. ఒక ప్రత్యేక టీం చేత నిఘా ఏర్పాటు చేసి గమనిస్తూ ఉంటాం అన్నారు. కొంతమంది తమ ఫ్రెండ్స్‌ను కొట్టారని, కొంతమంది మెప్పు కోసం, డబ్బుల కోసం జల్సాలకి, మత్తు పదార్థాలకు అలవాటు పడి గొడవలకు, నేరాలకు పాల్పడుతున్నారన్నారు. స్నేహితులు, ఇతరుల కోసం చట్ట వ్యతిరేక మైన కార్యకలాపాలకు పాల్పడి కేసులు నమోదు అయి భవిష్యత్తు నాశనం చేసుకో వద్దని తెలిపారు. ఏదైనా సమస్య ఉన్న, అపాయం ఉన్న, ఎవరైనా దాడులకు పాల్పడిన, ఇబ్బందికి గురి చేసిన పోలీస్ వారిని సంప్ర దించాలని, డయాల్ 100 కాల్ చేయాలని సూచించారు. చాలా కాలం నుండి రౌడీషీటు ఓపెన్ అయి ఉండి గత పది సంవత్సరాల నుండి ఎలాంటి నేరాల్లో పాల్గొనకుండా సత్ప్రవర్తన కలిగి ఉన్న వ్యక్తు లను గుర్తించి వారి రౌడీషీట్లను తీసేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిజమాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, 5వ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ చబుత్ర



నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు బుధవారం రాత్రి 11 గంటల నుండి రాత్రి 01: 30 నిముషాలు మధ్యలో చంద్రశేఖర్ ఎక్స్ రోడ్, చంద్రశేఖర్ కాలనీ, గౌతమ్ నగర్ రైతుబజార్ చౌరస్తా ఏరియాలో ఆపరేషన్ చబుత్ర కార్యక్రమాన్ని మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిబాబు మాట్లాడుతూ.. ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్, నలుగురు డ్రైవింగ్ చేసే వాహనాలను పట్టుకున్నారు. అలాగే ఓపెన్ డ్రింకింగ్‌లో ముగ్గురిపై ఈ పిటి కేస్ నమోదు చేస్తామన్నారు. మైనర్ డ్రైవింగ్ చేసినవారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించి 18 వెహికిళ్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఇకనుండి ఎవరైనా రాత్రి 10:30 గంటల తర్వాత షాప్ ఓపెన్ చేసిన, అలాగే ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా వెహికల్స్ రోడ్డు పైన తిరిగిన అర్ధరాత్రి సమయంలో ఎవరైనా వ్యక్తులు రోడ్లపైన లేకుంటే, గ్రౌండ్లో తిరుగుతూ అడ్డాలు వేసిన వారిపైన చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కావున నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజలు పోలీస్ శాఖ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు లేకుంటే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ రఘుపతి, మూడవ పోలీస్ స్టేషన్ సిబ్బంది, 18 మంది క్యూఆర్టీ సిబ్బందితోపాటు మొత్తం 50మంది పోలీసులు ఉన్నారు.

పలువురిని అభినంధించిన పోలీస్ కమిషనర్

నిజామాబాదు డివిజన్ పరిధిలలోని నవీపేట్ పోలీస్ స్టేషన్, ముగుపాల్ పోలీస్ స్టేషన్, నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులలో నేరస్థులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్‌ను గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య పూలమొక్క, శాలువాతో అభినంధించి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సత్కరించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజారెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసంత్, ఏపీపీఓ రాజేష్ గౌడ్‌ను సన్మానించారు. ఇన్వెస్టిగేషన్ అధికారులు సిఐ సతీష్ కుమార్, సురేష్ కుమార్, ఎస్సై బాల్‌రెడ్డి, కోర్టు డ్యూటీ అధికారులు నవీన్ కుమార్ పోలీస్ కానిస్టేబుల్ నవీపేట్, శ్యామ్ రావు పోలీస్ కానిస్టేబుల్ ముగ్పాల్, కిరణ్ నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో నేరస్తులకు శిక్ష లు పడటానికి ఎంతో కృషి చేసారని, ఇదే స్ఫూర్తితో మిగితా పోలీస్ స్టేషన్‌లలో గల కోర్ట్ సిబ్బంది కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ట్రైన్ ఐపిఎస్ సాయికిరణ్, అదనపు పోలీస్ కమిషనర్ స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాస్ రావు, ఇన్చార్జ్ చదరపు డీసీపీ మస్తాన్ అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ఎన్‌డిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-మోపాల్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్

రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎన్‌డిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలో బోర్గాం (పి), తానాకుర్తి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ రామేశ్వర్, మరియు మాజీ విండో చైర్మన్ సూర్య రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సన్నాలు పండించడానికి 500 బోనస్ ఇస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందని ఆదేశించారు. ధాన్యం అమ్మిన రైతుల వివరాలను వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని, డబ్బులు త్వరగా వచ్చేలా లారీల కొరత కానీ గన్ని బ్యాగుల కొరత గాని లేకుండా నిరంతరం సిబ్బంది పర్యవేక్షిస్తుండాలని ఆయన సిబ్బందిని ఆదేశిం చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రఘు పటేల్, డైరెక్టర్ మహేందర్, మాజీ సర్పంచ్ జలంధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజిరెడ్డి, సాయిబాబా, చిరంజీవి, సీతఈ కృష్ణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వస్తువులకు బీఐఎస్‌పై తప్పనిసరి

- వినియోగదారుల మండలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా బిఐయస్ స్టాండర్డ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9, 10న వినియోగదారుల చైతన్య సదస్సులు నిజామాబాద్‌లోని వినాయక నగర్‌లో నిర్వహించారు. రెండు రోజుల చైతన్య సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్లో వినియోగదారుల అనునిత్యం కొనుగోలు చేస్తున్న వస్తువులు టివిలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, మోటర్ సైకిళ్లు, కార్లు, గీజర్‌లు, ఓవెన్‌లు, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇండ్ల నిర్మాణాల్లో సిమెంట్, ఐరన్, బంగారం, వెండి తదితర (254) రకాల వస్తువులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరి చేసిందని తెలిపారు. అయితే నాణ్యతా ప్రమాణాలతో కూడిన వస్తువులు బహిరంగ మార్కెట్లో లభించక పోవడం, వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాల పట్ల అవగాహన లేకపోవడం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విధానాలు అమలు కాకపోవడం వల్ల వినియోగదారులు మోసపోతున్నారని సాంబరాజు చక్రపాణి అన్నారు. కాబట్టి వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ తెలంగాణా రాష్ట్రంలోని (33) జిల్లాల్లో "జిల్లా స్థాయి బి.ఐ.యస్ స్టాండర్డ్స్ కమిటీ" లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతీ జిల్లాకు అధ్యక్షుడు, కార్యదర్శి లుగా (15) మంది సభ్యులుగా జిల్లా కమిటీ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నాణ్యతా ప్రమాణాలను ప్రజల్లో విస్తృత ప్రచారం తో పాటు, అక్రమ వ్యాపారాలపై వినియోగదారుల కమిషన్లలో ఫిర్యాదు చేయడం, మోసపోయిన వినియోగదారులకు నష్ట పరిహారం ఇప్పించడం ప్రధాన లక్ష్యాలుగా విధులు నిర్వహిస్తుందని తెలిపారు. రెండు రోజుల చైతన్య సదస్సులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ, కార్యదర్శులు యాటకర్ల దేవేష్, మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, మహిళా విభాగం కార్యదర్శి లక్ష్మీ ప్రవళ్ళిక లు పాల్గొని వినియోగదారుల సమస్యలపై సూచనలు చేశారు.

నేడు వేణుగోపాల స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో వెలసిన శ్రీ స్వయంభు వేణుగోపాల స్వామి ఆలయ శిఖర శ్రీ సుదర్శన పున ప్రతిష్టాపన మహోత్సవం గంగోత్రి శ్రీ రామానుజ పీఠాధిశ్వర శ్రీ శ్రీ రామానుజ దాస స్వామి, కేదారేశ్వర పీఠాధిశ్వర శ్రీశ్రీశ్రీ మంగి రాములు మహారాజ్ ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు వేద అంగరంగ వైభవంగా నిర్వహించినట్టు ఆలయ అధ్యక్షుడు సి శ్రీనివాస్ రెడ్డి, ధర్మకర్తలు, ఆలయ అర్చకులు తెలిపారు. ఈ ఆలయ శిఖర శ్రీ సుదర్శన పున ప్రతిష్టాపన మహోత్సవం 11న విశారద శ్రీమాన్ చిలకమర్రి శ్రీ వర్ధనాచార్యులు యజ్ఞచార్యత్వమున ఏకకుండాత్మకంగా మూడు రోజులపాటు పలు పూజ, యజ్ఞ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. గురువారం శ్రీ వేణుగోపాల స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా సాగాయని అన్నారు. 12న శనివారం అన్నదాన వితరణ నిర్వహిస్తారని తెలిపారు. కంఠేశ్వర్ ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు నగర ప్రజలు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తులు తమ వంతు సహకరించాలని, ఆలయ ధర్మకర్త మండలి తేజస్విని, తుమ్మ ప్రవీణ్, కులగని నర్సింగ రావ్, గజుల శ్యాం రాజ్, సంగవి అశోక్, లక్ష్మీ నారాయణ, ఆలయ కోశాధికారి కోన ప్రవీణ్ గుప్తా, కార్యశీల కార్యదర్శి లోగం రాజేశ్వర్, లక్ష్మి, ఆలయ అర్చకులు కృష్ణస్వామి కోరారు.

నాల్గోవ రోజు బడిబాట

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట కార్యక్రమం గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. పాఠశాలల్లో విద్యార్థుల పెంపుదల లక్ష్యంగా ఇంటింటా తల్లి తండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల ఆవశ్యకత తెలియజేశారు. ఏటిఎల్ ప్రయోగశాల ఒకేషనల్ విద్యా అగ్రికల్చర్, హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల గురించి అవగాహన కల్పించి విద్యార్థుల చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యం.గంగారాం, ఉపాధ్యాయులు వన్నెల్ దాస్ నరేష్, గుండోజీ నరేందర్, కొండ్రు నవీన్, గట్టు రాజేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన బిజెపి నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న గావ్ బస్తి చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ఇంచార్జ్ నాయిడి రాజన్న, మండల అధ్యక్షులు కన్నెపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంగన్వాడి కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో 10, 11 ,12 తేదీల్లో చేపట్టవలసిన పలు కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, ఇందల్వాయి మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఐటీ సెల్ కన్వీనర్ శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షులు బొజ్జ సంజీవ్, తిరుపతి రెడ్డి, కుంట శ్రీనివాస్, సొప్పరి సుజిన్, మోహన్ నాయక్, భూమేశ్వర్ ,భూస క్రాంతి, నర్సోజి తదితరులు పాల్గొన్నారు.

వీడిసిని కఠినంగా శిక్షించాలి : డీఎస్‌పి

- తాళ్ళ రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తుల బహిష్కరణపై అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తుల బహిష్కరణపై వీడిని కఠినంగా శిక్షించాలని, తాళ్ల రాంపూర్ గౌడ కులస్తులకు, మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని దళిత సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తుల బహిష్కరణ పై అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ పార్టీ నాయకులు మాట్లాడుతూ..నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్ళ రాంపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ పూజారి శ్రీరామనవమి ఉత్సవంలో భాగంగా కుంకుమార్చన లో పాల్గొన్న గౌడ కులానికి చెందిన మహిళలు పాల్గొనకుండా అవమాన పరచడమే కాకుండా గౌడ కులస్తులను గ్రామం నుండి బహిష్కరించారన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వీడిసి సభ్యులను, పూజారి మీద కేసు నమోదు చేసి వెంటనే విచారణ చేపట్టి నిందితులైన వారిని తక్షణమే చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామ గ్రామాన చాటింపుల ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈదుశ్చర్యకు పాల్పడిన విడిసి సభ్యులను కఠినంగా శిక్షించి తాళారాంపూర్ గౌడ కులస్తులకు మహిళలకు న్యాయం జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుమన్, ప్రేమ్, జిల్లా అధ్యక్షులు మహిపాల్, జిల్లా నాయకులు రమేష్, సుభాష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు 12 రకాల సరుకులు ఇవ్వాలి

- పీవోడబ్ల్యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రేషన్ షాపుల్లో సన్న బియ్యంతో పాటు సన్న బియ్యంతో పాటు 12 రకాల నిత్య అవసరాల సరుకులు సరపర చేయాలి అని సివిల్ సప్లై ఆఫీసర్‌కు పిఓడబ్ల్యు (ప్రగతిశీల మహిళా సంఘం) ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులలో సన్న బియ్యం ఇస్తుంది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్న ఇంతవరకు కొత్త రేషన్ కార్డులను ఇవ్వలేదన్నారు. దీంతో అనేకమంది అర్హులైన పేదలు రేషన్ కార్డు లేక చాలా ఇబ్బందులుపడుతున్నారని, ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు కానీ ప్రజలకు అవసరమయ్యే చక్కెర, గోధుమలు, పప్పు, నూనె, కారం, పసుపు, చింతపండు, వంటివి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందించడం లేదు కాబట్టి రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 12 రకాల నిత్య అవసరాల సరుకులను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా నాయకులు సునంద, నరసక్క, లలిత, అమూల్య, నాగరాణి, మొత్తం 15 మంది మహిళలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని తిమ్మానగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆర్అండ్‌బి రోడ్డుపై చలివేంద్రంను గురువారం పంచాయితీ సెక్రటరీ సాయిబాబా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుతున్న ఎండలకు గ్రామ ప్రజల దప్పిక తీర్చడానికి చలివేంద్రంను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దొబ్బలి రామాంజి, పంచాయితీ సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామస్తులు

పౌష్టికాహారంపై అవగాహన

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని మేడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చందా నాయక్ తండాలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం, రక్తహీనతపై అంగన్వాడీ టీచర్ గంగలత అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ గంగాలత మాట్లాడుతూ.. పిల్లలకు పాలిచ్చే తల్లులు తప్పనిసరిగా జీరో నుంచి ఆరు నెల వరకు పిల్లలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా వంటిదని తెలిపారు. ఆరు నెలల తర్వాత పిల్లలకు పౌష్టికాహారం తినిపించాలన్నారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ టీచర్

బండ్ల బాటను కబ్జా చేసిన వారిని శిక్షించాలి

- రైతుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని రాధాస్వామి వెనకాల నుంచి పంట చేనుకు ఉన్న బాటను కబ్జా చేశారని, వంద ఏళ్లుగా అదే ఎడ్లబాట గుండా పంటపొలాలకు వెళ్తున్నామని, రాధాస్వామి వారు దాన్ని కబ్జా చేయడంతో పంట పొలాలకు వెళ్లే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తహసీల్దార్ రేణుక చవాన్‌కు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బండ్ల బాటను కబ్జా చేసిన వారిని శిక్షించి రైతులు వందల సంవత్సరాలుగా వెళ్తున్న బండ్లబాటను పంట పొలాల్లోకి వెళ్ళడానికి దారి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ శివారు రైతులు పాల్గొన్నారు.

వంట గ్యాస్, చమురు ధరలను పెంచి
దేశ ప్రజలను వంచించిన ప్రధాని

- సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు ప్రకాష్

నవతెలంగాణ-కామారెడ్డి

వంట గ్యాస్, చమురు ధరలను పెంచి దేశ ప్రజలను ప్రధాని మోడీ వంచించారని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు ప్రకాష్ తీవ్రంగా విమర్శించారు. గురువారం కేంద్ర ప్రభుత్వం పెంచిన చమురు ధరలు, వంట గ్యాస్ ధరలకు నిరసనగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఎదురుగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్లుగా సంపన్నులైనా కార్పోరేట్ల కొమ్ముకాస్తు దేశ ప్రజలపై ధరలు, పన్నులు పెంచి వాళ్ల వెన్ను విరుస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా చమురు - క్రూడ్ ఆయిల్ రేట్లు తగ్గిన ఇక్కడి పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ.. పెట్రోల్, వంట గ్యాస్ ధరలు పెంచడం సిగ్గుచేటన్నారు. ధరలు, నిరుద్యోగం, ఆకలి, పేదరికం, ద్రవ్యోల్బణం లాంటి సమస్యలను పట్టించుకో కుండా, పరిష్కరించకుండ మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ప్రజలపై మరింత భారం వేయడం శోచనీయమని తెలిపారు. కేంద్రం పేదల పొట్టకొట్టడం తప్ప పేదలను ఆదుకున్నది లేదన్నారు. కోటీశ్వరులకు మేలు చేసేందుకే చమురు, వంట గ్యాస్‌లను పెంచి తమ నైజం చాటుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు అనిత, హేమలత, స్వర్ణ, కార్మిక సంఘం నాయకులు నారాయణ, రమేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు జి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

ఏకరూప దుస్తుల ముందస్తు ప్రణాళిక



విద్యార్థుల కొలతలు తీసుకుంటున్న స్వయం సహాయక సంఘం మహిళ

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులందరికీ రెండు జతల చొప్పున ఏకరూప దుస్తుల (యూనిఫాం)ను పంపిణీ చేయడానికి ముందస్తు ప్రణాళిక రూపొందించారు. కుట్టుపని బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. గురువారం విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిఫాం కొలతలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టీఎస్ హ్యాండ్లూమ్ వీవర్స్ సొసైటీ) ద్వారా విద్యార్థులకు యూనిఫాం క్లాత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు నాగనాథ్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

నవతెలంగాణ-పిట్లం

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండాపల్లి, బోల్లక్‌పల్లి, గౌరారం, గౌరారం తండా, రాంపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం పండించిన ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోని విక్రయించి లబ్ధి పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం శిరీష, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాంబిగే హన్మాండ్లు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇమ్రోజ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మోహిన్, పత్తేపురం సంజీవులు, ఆయా గ్రామాల మహిళా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి శిక్షణ శిబిరానికి జిల్లా చైర్మన్ ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో ఈ నెల11నుంచి 15 వరకు నిర్వహించే ఆదివాసి కాంగ్రెస్ లీడర్‌షిప్ డెవలప్మెంట్ శిక్షణ శిబిరానికి జిల్లా నుంచి రాణా ప్రతాప్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ రాథోడ్ గిరిజన యువ నాయకులు ఎంపికయ్యారు. శిక్షణ శిబిరానికి తెలంగాణ నుంచి నలుగురిని ఎంపిక చేసినట్టు జిల్లా చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్ గురువారం తెలిపారు. ఎంపికైన వారిలో భూక్య కోటియా నాయక్ (కోదాడ), రాణా ప్రతాప్ రాథోడ్ (కామారెడ్డి), శ్రీనివాస్ రాథోడ్ (రంగారెడ్డి), నరేష్ రాథోడ్ (కామారెడ్డి)లు ఉన్నారు.

లబ్ధిదారుల స్థితిగతులు పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గుండూర్ గ్రామంలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల స్థితిగతులను ఎంపీడీవో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గుండూర్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలను సందర్శించారు. ఎండలు ఉండంతో ఉదయం పూట త్వరగా పనులకు వెళ్లి.. మధ్యాహ్నం లోపు ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు. పని ప్రదేశంలో పనులు సక్రమంగా నిర్వహిస్తే తగినంత కూలి లభిస్తుందని తెలిపారు.

అధికారులు రైతులను వేధించొద్దు

- విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ నారాయణ

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగించే రైతులును విద్యుత్ శాఖ అధికారులు వేధించొద్దని సకాలంలో సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సబ్ గాంధారి, సర్వాపూర్, శెట్టిపల్లి, సంగారెడ్డి, నాలుగు సెక్షన్ల పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు అయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి మేంగారం, బాణాపూర్, పరమల్ల, లింగంపేట్, మోతే, ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంట పొలాల వద్ద గత నలభై సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలకు చేరుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, విద్యుత్ వైర్లు నేలకు తగులుతున్నాయని చైర్మన్ దృష్టికి రైతులు తీసుకొచ్చారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి వచ్చినటువంటి దరఖాస్తులను విన్నపాలను స్వీకరించారు. విద్యుత్ వలన ఏఏ సమస్యలు తలెత్తుతున్నాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. పరిష్కార వేదికలో వచ్చిన టువంటి దరఖాస్తులను సంబంధిత అధికారులతో మా ట్లాడి పరిష్కరించారు. రైతులు వ్యవసాయం వద్ద బోరు మోటర్లకు కెపాసిటర్లను బిగించుకొని విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు 40 రోజుల్లోనే పరిష్కరిం చాలన్నారు. రైతులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే స్తంభాలు ఎక్కడ ఫీజు మార్చు కోవడం లాంటి పనులకు దూరంగా ఉండాలన్నారు. ఎల్సీ తీసుకోకుండా పనిచేయవద్దన్నారు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. దీనివల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయని సూచించారు. విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి నష్టాలబారి నుంచి కాపాడాలన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు వివరించాలని వారితో సకాలంలో పని చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు కిషన్ రాజా గౌడ్, ఎస్సీ శ్రవణ్ కుమార్, డిఈ విజయ సారథి, ఏడి మల్లేశం, ఏఈలు సాయినాథ్, హరీష్ రావు, లక్ష్మయ్య, అశోక్, విద్యుత్ సిబ్బంది, లైన్‌మెన్‌లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ నారాయణ

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఏఎంసి వైస్ చైర్మన్ పరమేష్ పటేల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసి వైస్ చైర్మన్

నవతెలంగాణ-మద్నూర్

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ అన్నారు. గురువారం డోంగ్లి మండలంలోని మోగా గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రైతులకు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా సన్నబియ్యం క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డోంగ్లి సింగిల్ విండో చైర్మన్ రామ్ పటేల్, మండల ఏవో శివ, ఏఈఓ విశాల్, మాజీ ఎంపిటిసి హనుమంత్ పటేల్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రక్తదానంతో చిన్నారుల ప్రాణాలను కాపాడాలి

- సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి
- మెగా రక్తదాన శిబిరం అభినందనీయం



జడ్జికి మెమోంటోను అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడాలని సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని 14న తాడ్వాయి మండల కేంద్రంలో కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషనల్ (ఐవిఎఫ్), అంబేద్కర్ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి వారి కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జడ్జి నాగరాణి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా 20 వేల మంది తలసేమియా చిన్నారులు ఉండడం బాధాకరమని, వారి ప్రాణాలను కాపాడడానికి యువత పెద్ద సంఖ్యలో రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్, సూపరింటెండెంట్ వంచ చంద్రసేన్ రెడ్డి, డాక్టర్ దేవ, తదితరులు పాల్గొన్నారు.

వరి కోతల జాగ్రత్తలపై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో హార్వెస్టర్ డ్రైవర్స్, యజమానులతో వ్యవసాయ అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ అపర్ణ మాట్లాడుతూ.. వరి కోతలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పెట్టి ఫ్యాన్ బెల్ట్ అమర్చుకునే విధానం, తాళ్లు పొల్లు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఏవోలు శోభ, నరేంద్ర, మణిదీపిక, ఏఈవోలు వినోద్, లిఖిత, మౌనిక, లత, హార్వెస్టర్ డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి



పిట్లం: పాదయాత్రలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



తాడ్వాయిలో..

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-పిట్లం/తాడ్వాయి

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు మద్దెల్ చెర్వు, బోల్లక్‌పల్లి, బండాపల్లి , గౌరారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తుందని తెలిపారు. అంబేద్కర్ సిద్ధాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హన్మాండ్లు, నడిపి గంగారం, శ్రీరాములు, ఇమ్రోజ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలంలోని ఎండ్రియాల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణపై పాదయాత్ర నిర్వహించినట్టు గ్రామ అధ్యక్షులు గైని సంజీవ్ తెలిపారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వీధుల గుండా రాజ్యాంగంపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని శివాజీ, సంతాజి గారి సుధాకర్ రావు, మేకల రాజు, బండారు సంజీవ్, నాయకులు, కార్యకర్తలు, తదితరు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు వస్తారని, సకల సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్‌కు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు తెలిపారు. గురువారం జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆవిష్కరించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు సాయి పటేల్, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారికి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్, డోంగ్లి, మండలాల్లో జిల్లా పంచాయతీ అధికారి మురళి గురువారం సందర్శించారు. మద్నూర్ మండల అభివృద్ధి అధికారి రాణి, డోంగ్లి మండల ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకట నరసయ్య ఇరువురు కలిసి జిల్లా పంచాయతీ అధికారికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. డోంగ్లి మండల కేంద్రంలో ఆ గ్రామ సింగిల్ విండో చైర్మన్ రామ్ పటేల్ డిపిఓకు సన్మానించారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో అభివృద్ధి పనుల పట్ల ప్రత్యేక దృష్టి సాధించాలని డిపిఓ ఎంపీడీవోలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి సందీప్ కుమార్ పాల్గొన్నారు.



పంచాయతీ అధికారిని సన్మానించిన పలువురు

నీటి విడుదల నిలిపివేత



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు గురువారం ఉదయం నుంచి నీటి విడుదలను నిలిపివేసినట్టు ప్రాజెక్టు ఏఈఈ శివ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగి సాగు కోసం ఆరు విడుతలుగా 10.4 టీఎంసీల నీరు ప్రాజెక్టు కింద సాగు చేసిన 1,25,000 ఎకరాల పంట పొలాలన్నింటికీ అందించినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం ప్రాజెక్టులో 5.856 టీఎంసీల నీరు నిలువ ఉందని వివరించారు.

జూనియర్ అసిస్టెంట్‌గా లావణ్య

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా లావణ్య భాధ్యతలు స్వీకరించారు. ఈమె పిట్లం మండలంలోని సిద్దాపూర్ గ్రామం నుంచి వచ్చినట్టు తెలిపారు. ఆమె తండ్రి విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సందర్భంగా కూతురుకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఆమె మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వర్సిటీలో తరగతులు బహిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్లు గురువారం క్యాంపస్‌లోని వివిధ కళాశాలల తరగతులను బహిష్కరించారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బైటాయించి నిరసన, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడించిన వివిధ వర్సిటీల అకడమిక్ కన్సల్టెంట్లను అరెస్ట్ చేయడాన్ని వారు నిరసించారు. జీవో నెంబరు 21ను వెంటనే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చలో వరంగల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్



ఏప్రిల్ 27 న నిర్వహించే చలో వరంగల్ పోస్టర్‌ను మండలంలోని అంకాపూర్ గ్రామంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వేలాది పార్టీ కార్యకర్తలు కుల సంఘాల పెద్దమనుసులు, యూత్ అధ్యక్షులు, పార్టీ ముఖ్యనాయకులు వార్డు అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలొ సీనియర్ నాయకులు పోల సుధాకర్ , పట్టణ అధ్యక్షుడు పూజా నరేందర్,మాజీ సర్వసమడ్ అధ్యక్షులు సుంకరి రవి,డాన్ మహేష్ కౌన్సిలర్ లింబాద్రి గౌడ్ సీనియర్ నాయకులు నచ్చు చిన్నరెడ్డి,సత్యం, లతీఫ్ అధ్యక్షులు మరియు మాజీ కౌన్సిలర్ నర్మే నవీన్,యూత్ అధ్యక్షులు గుంజల పృధ్వి,అగ్గు క్రాంతి టౌన్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు జన్నేపల్లి రంజిత్, సాంబాడి అనండి, బోగా గిరీష్, శ్రీకర్, శైఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పీఏసీఎస్ సొసైటీ పాలకవర్గాలు, డీసీఎంఎస్ సొసైటీ పాలకవర్గాలు, ఐకెపి మహిళా సంఘాల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి చొరవ తీసుకొని ఏర్పాటు చేయించినట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతులకు ఇబ్బంది లేకుండా ఆయా పాలకవర్గాలు వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఇకపై ఎలాంటి ఇబ్బందులూ ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి కోరారు.

ఎన్ఆర్ఐ పాలసీ సలహా సంఘం సభ్యులుగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న సంఘ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన సలహా సంఘంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని సభ్యులుగా నియమించిన సందర్భంగా ఈ సలహా సంఘం చైర్మన్ డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్ ఐఎఫ్ఎస్ రిటైర్డ్, సంఘం వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు డాక్టర్ సిస్టర్ లిజి జోసేఫ్, చెన్నమనేని శ్రీనివాస్ రావు, గుగ్గిళ్ళ రవి గౌడ్ గురువారం ఎమ్మెల్యేను హైదరాబాద్ లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీలో పొందుపరచాల్సిన వివిధ అంశాలపై చర్చించారు. గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీలో ఉండాల్సిన విషయాలు, వీసా, ఇమ్మిగ్రేషన్, ఉద్యోగం, ఆరోగ్యం, పునరావాస మొదలైన అంశాలపై పూర్తిస్థాయి నోట్ ను తయారు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నూతనంగా నియామైన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను సన్మానించారు.

కల్తీకల్లు తయారీదారులపై చర్యలు ఉత్తుత్తివే

- సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కల్తీకల్లు తయారీదారులపై చర్యలు ఉత్తుత్తివేనని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో తాటివనం, ఈతవనం ఎక్కువగా ఉన్నప్పటికీ ఈ చెట్ల నుండి కల్లు తీసి గతంలో నాణ్యమైన కల్లు అమ్మేవారన్నారు. కానీ ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ అండదండలతో కల్లు కాంట్రాక్టర్లు గీతా కార్మికులను చెట్ల నుండి కల్లు తీసే పని నుంచి దూరం చేసి సిట్టింగ్ పేరుతో కార్మికులను పక్కన కూర్చోబెట్టి నీళ్లలో ఆల్ఫో జోలం, డైజో ఫామ్ మరికొన్ని ప్రమాదకరమైన రసాయనాలు కలిపి కల్తీ కల్లు తయారు చేస్తు కల్లుప్రియుల జీవితాలతో చెలగాటమాడు తున్నారు. ఎక్సైజ్ శాఖతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్, హైదరాబాద్ స్పెషల్ పార్టీ శాఖలు ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో కల్లు కల్తీకాకుండా ఎందుకు ఆపలేకపోతున్నారని సంబంధిత అధికారులకు ప్రశ్నిస్తున్నామన్నారు. నెలవారి మామూళ్ల మత్తుతో ఉండి పేదలను కల్తీకల్లుకు బానిసలు చేయడం మూలంగా కల్తీ కల్లు తాగిన వారు పిచ్చివాళ్లలాగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కల్తీ కళ్ళు తాగకపోతే వారి నరాలు చచ్చు పడిపోతున్నాయని, కల్లు తాగితే తప్ప వారు పనులు చేసుకోలేక చేయలేకపోతున్నారని అన్నారు. కల్తీకల్లు తాగి హడావుడి జరిగినప్పుడు మాత్రం ఒకటి రెండు రోజులు కొన్ని కల్లు దుకాణాలపై దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఇది ఉత్తుత్తి చర్యేనని అన్నారు. కల్తీకల్లు తయారు చేసినవారిపై చట్టరిత్యా చర్యలు తీసుకొని కల్తీకల్లు బారిన పడ్డ వారికి ప్రభుత్వ ఆసుపత్రిలలో చికిత్స ఇచ్చి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, పోలీస్ శాఖపై ఉన్నదని అన్నారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు పి.నర్సింగరావు, ప్రసాద్, సాయిలు, గోవర్ధన్, షేక్ సలీం, మహమ్మద్, రషీద్ పాల్గొన్నారు.

12 నుంచి మల్లన్న ఉత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

వేంపల్లి గ్రామంలో శ్రీ మల్లన్న ఉత్సవాలు ఈ నెల 12 నుండి 15వ తేదీ వరకు కొనసాగుతాయని యాదవ సంఘం పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. 13న బోనాలతో పాటు స్వామి వారి కళ్యాణం ఉంటుందని అన్నారు. చివరి రోజు మంగళవారం భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి పోరాడుదాం

- పీడీఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ విద్య బలోపేతానికి పోరాడుదామని నాయకులు అన్నారు. పీడీఎస్‌యు ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని నాగారం ప్రభుత్వ డైట్ కళాశాలలో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి, చేగువేరా కామ్రేడ్ జార్జి రెడ్డి వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ సభాధ్యక్షత వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కామ్రేడ్ జార్జి రెడ్డి ఫోటోలకు పూలదండలు వేసి, మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పౌర హక్కుల సంఘం (సీఎల్‌సి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలగోట్ రవీందర్ మాట్లాడుతూ.. శాస్త్రీయ భావజాలంతో మతోన్మాద చీకటిని తొలగించడానికి నిప్పురవ్వగా వెలిగిన జార్జిరెడ్డి విద్యార్థులకు స్ఫూర్తి కెరటంలా నిలిచారన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 14, 1972న మతోన్మాదుల చేతిలో జార్జ్ రెడ్డి అమరులయ్యారన్నారు. ప్రజలను కుల మతాలుగా చీల్చి, కరుడుగట్టిన హిందుత్వాన్ని ప్రచారం చేయడం కోసం, విద్యా కార్పొరేటికరణ చేస్తూ , జాతీయ విద్యావిధానం అనే ముసుగు ధరించి కార్పొరేట్లకు దోచిపెట్టే విధానంతో నేడు కేంద్రం ప్రభుత్వం అధికారం చెలాయిస్తుండటాన్ని మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జార్జి వారసత్వాన్ని కొనసాగిస్తున్న ప్రగతిశీల విప్లవ విద్యార్థి శక్తులు శాస్త్రీయ విద్యావిధానాన్ని సాధించడమే లక్ష్యంగా పోరాటాలు ముందుకు తీసుకు పోవడం కోసం కంకణబద్ధులు కావాలన్నారు. విద్యా సంస్థలలో మత, భావజలానికి కల్లోలాలకు, వ్యతిరేకంగా విద్యార్థులు జార్జ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో స్త్రీలపై, దళితులపై మైనార్టీలపై, వెనుకబడిన తరగతుల ప్రజలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఏ మనుస్మృతికి వ్యతిరేకంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాడారో అదే నేడు దేశంలో విచ్చలవిడిగా విలయతాండవం చేస్తుందన్నారు. కార్యక్రమం లో పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సుధాకర్, నాయకులు సృజన్, డైట్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ సంజీవ్, కళాశాల అధ్యాపకులు అరవింద్, భాస్కర స్వామి,పద్మనాభం, వెంకటేశ్వరరావు,శంకర్, రవి లతో విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యం తేవాలి

నవతెలంగాణ-బాల్కొండ/నవీపేట్

మండల పరిధిలోని వన్నెల్ (బి), జలాల్ పూర్, బోదేపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాలు అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూసుకోవాలని ఐకెపి సిబ్బందిని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న ఐకెపి ఉద్యోగులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీధర్, ఎంపీఓ గంగ మోహన్, సూపరింటెంట్ రమణ, ఏపీఎం గంగాధర్, సిసి సుష్మ రైతులు పాల్గొన్నారు.



బాల్కొండ: జలాల్‌పూర్‌లో..

నవీపేట్:రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం భూమేశ్వర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి మద్దతు ధరతో పాటు బోనస్‌ను పొందాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ కమిటీ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, మాజీ జెడ్పీటిసి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్ కుమార్ గౌడ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, బుచ్చన్న, మహిపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, మోస్రా సాయి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నవీపేట్‌లో..

దేగాం గ్రామానికి రాష్ట్రస్థాయి పురస్కారం

- ఎంపీడీవోకు సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలోని దేగాం గ్రామం సుస్థిర గ్రామీణ అభివృద్ధికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం ఎంపీడీవోతో పాటు సంబంధిత అధికారుల ను సన్మానించారు. 2022-2023 సంవత్సరంలో గ్రామ పంచాయతీ అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి, కేంద్ర ప్రభుత్వం అందించే 19వ రాష్ట్ర స్థాయి అవార్డును గెలుచుకుంది. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ, "దేగాం గ్రామం శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మహిళా సాధికారత, జలవ్యవస్థాపన వంటి రంగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిందని అన్నారు. కార్యదర్శి శ్రీనివాస్‌ను శాలువతో సత్కరించారు కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, కార్యదర్శులు రాజలింగం, దినేష్, నవీన్, నసీర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా

ట్రాఫిక్ మళ్లింపు

- ప్రజలు, వాహనదారులు గమనించాలి
- నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 12వ ఉదయం నుండి రాత్రి వరకు హనుమాన్ జయంతి శోభ యాత్ర సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని, దీన్ని ప్రజలు వాహనదారులు గమనించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ జయంతి శోభాయాత్ర కంఠేశ్వర్ ఆలయం నుండి ప్రారంభమై, జడ్పీ చౌరస్తా, హమాల్వాడి, పాత ప్రభాస్ టాకీస్, రైల్వే ఫ్లై ఓవర్ మీదుగా, గోదాం రోడ్, దేవి రోడ్, మమతా సర్కిల్, గాంధీ చౌక్, నెహురు పార్క్, అజాం రోడ్, పెద్దబజార్, లక్ష్మి మెడికల్, చివరిగా ఆర్.ఆర్ చౌరాస్తా వరకు చేరుకుంటుందని పేర్కొన్నారు. గోదాం రోడ్, దేవి రోడ్, మమతా సర్కిల్, గాంధీ చౌక్, నెహురు పార్క్, పెద్ద బజార్ లక్ష్మి మెడికల్, ఆర్ ఆర్ చౌరస్తా వరకు గల దుకాణ యజమానులు, నివాసం ఉండే వారు ఈనెల.11న రాత్రి 8 గంటల నుండి తేదీ 13 ఉదయం 6 గంటల వరకు వాహనాలను శోభ యాత్ర వెళ్లే మార్గంలో రోడ్డు పైన పార్క్ చేయొద్దని తెలిపారు. హైదరాబాద్, ఆదిలాబాద్, వరంగల్ వెల్లు బస్సులు ఆర్టీసీ బస్టాండ్, జెడ్పి రోడ్, నిర్మల హృదయ స్కూల్ ముందు నుండి అంబెద్కర్ కాలనీ, దుబ్బ రోడ్, గిరిరాజ్ కాలనీ నుండి బైపాస్ రోడ్డు చేరుకోవాలని తెలిపారు. బోధన్ నుండి వచ్చి పోయే వాహనాలు:- అర్సపల్లి రైల్వే గేట్ నుండి కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బై పాస్, కంటేశ్వర్ టెంపుల్ జంక్షన్, ఎన్టీఆర్ చౌరాస్తా, ఆర్టీసీ బస్ స్టాండ్ చేరుకోవాలని పేర్కొన్నారు. బాన్సువాడ నుండి వచ్చి పోయే వాహనాలు వర్ని చౌరాస్తా నుండి పూలాంగ్ సర్కిల్, కోర్ట్ సర్కిల్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ ఆర్టీసీ బస్‌స్టాండ్ చేరుకోవాలని సూచించారు.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ట్రాఫిక్ పోలీస్ వారికీ సహకరించాలని కోరారు..

అమృత్ - 2 పనులను పూర్తి చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

అమృత్ - 2 పనులను పూర్తి చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం సుభాష్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఇందూర్ కార్పొరేషన్‌లో అమృత్ -2లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి 162 కోట్లు,వాటర్ సప్లై 217 కోట్ల మంజూరు అయినా పనులపై సమీక్ష నిర్వహించారు. నగరంలో 150 మ్యాన్‌హోల్స్ పున్ద నిర్మాణం చేసినట్లు, అలాగే 45 కొత్తవి నిర్మాణం చేసినట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఒక కిలోమీటర్ పైప్ లైన్ వేసినట్లు, వాటర్ సప్లై కొరకు రెండు కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పనులు జరుగుతున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు నివేదిక అందజేశారు. వర్షాకాలన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరత గతిన పూర్తి చేయాలని, పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వేసవి కాలంలో నగర వాసులు మంచినీటికి ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగు చర్యలు తీసుకోవాలని మంచినీటి ట్యాంక్‌లు నాలా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతతో వేగవంతం చేసి వేసవిలోగ పూర్తి చేసి ఉపయోగంలో తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ తిరుపతి, డిఈ నగేష్ రెడ్డి, మేఘ ఇంజినీర్ యువరాజ్, ఏఈ వినావాణి, సుకుమార్, సాయి చంద్, శివ కృష్ణ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ

పశువులను సంరక్షించుకోవాలి

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ పశువులను సంరక్షించుకోవాలని జిల్లా పశు వైద్య పశు సంరక్షణ శాఖ అధికారి ఎం రోహిత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ పశు వైద్యశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుండి వచ్చేనెల 14 వరకు రైతుల ఇంటి వద్దకే వచ్చి గాలి కుంట నివారణ టీకాలు వేయనున్నట్టు తెలిపారు. సంవత్సరానికి రెండుసార్లు టీకాలు వేయడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, రైతులు సహకరించాలని కోరారు. పశువు, పక్షుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని, ముఖ్యంగా ఊర కుక్కలు, పెంపుడు కుక్కల నుంచి రేబిస్ వ్యాధి పాడి పశువుల నుంచి బ్రూస్ ఎల్లోసిస్, కోళ్ల నుంచి వ్యాపించే బర్డ్ ఫ్లూ లాంటి ప్రమాదకరమైన జూనోటిక్ వ్యాధులు వస్తాయని అన్నారు. ఈ వ్యాధులపై అవగాహన కలిగి వాటిని అరికట్టడంలో అందరూ భాగస్వాములై ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పశువుల ఆరోగ్య పరిరక్షణకు పాటు పడాల్సిన అవసరం ఉందని అన్నారు. పెంపుడు కుక్కలు, ఊర కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయాలని, కుక్క కాటు వేసినప్పుడు నాటు వైద్యుడిని సంప్రదించకుండా ప్రభుత్వ వైద్యశాలలో టీకాలు తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి లక్కం ప్రభాకర్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

నవతెలంగాణ-మోపాల్

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నిజామాబాద్ ఎన్ఎస్ఎస్ విభాగం -5 అధికారి యం.దస్తప్ప ఆధ్వర్యంలో మోపాల్ గ్రామంలో వారం రోజుల ప్రత్యేక శిబిరంలో గురువారం ముగిసింది. వారం రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామంలోని ప్రజలకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అయిన ప్లాస్టిక్ వాడకం, పర్యావరణ- పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ర్యాలీని నిర్వహిస్తూ ప్లాస్టిక్ వాడకం మంచిది కాదని, మూఢనమ్మకాలను పాటించొద్దని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులు తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు గ్రామ ప్రజలను కలుస్తూ సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. వీరి సేవలను గ్రామకార్యదర్శి శ్రీనివాస్ , గ్రామ సభ్యులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణేశ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, దండు స్వామి మాట్లాడుతూ వాలంటీర్ల సేవలను అభినందించారు. వీరి సేవలకు ప్రశంసా పత్రాలను కూడా అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం దస్తప్ప గ్రామ ప్రజలు, గ్రామ కమిటీ మెంబర్లు పాల్గొని విజయవంతం చేశారు.

ఐయన్‌టిఎస్‌ఓ ఒలంపియాడ్ ఎగ్జామ్‌లో

ట్యాబ్ గెలిచిన శ్రీ చైతన్య విద్యార్థి



బహుమతి అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జాతీయస్థాయిలో రెండు దశల్లో జరిగే ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ ఎగ్జామ్ చివరి దశలో నిజామాబాద్ పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచారు. ఈ ఎగ్జామ్‌లో 8 తరగతి చదువుతున్న టీవి ఆకాష్ గ్రాండ్ ప్రైజ్ లాప్టాప్, బంగారు పతకాన్ని గెలుపొందారు. 4వ తరగతి బన్సల్ కపిల్ ఫస్ట్ ప్రైజ్, బహుమతులు గెలుపొందారు. ఈ బహుమతిని నిజామాబాద్ జిల్లా ఏజీయం సతీష్ రెడ్డి, కోఆర్డినేటర్ డి. నాగేంద్ర , మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సుధీర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిజామాబాద్ పేరు నిలబెట్టిన శ్రీ చైతన్య విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ సుధీర్, డీన్ ఈశ్వర్, ఐపీఎల్ శివకుమార్, శ్యామ్ , ఇన్చార్జిలు పాల్గొన్నారు.

వంట గ్యాస్, చమురు ధరలను పెంచి

ప్రజలపై భారం వేసిన కేంద్రం

- ప్రగతిశీల మహిళా సంఘం, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా)

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/నిజామాబాద్ సిటీ

కేంద్రంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం వంట గ్యాస్, చమురు ధరలను పెంచి ప్రజలకు మోయలేని భారాన్ని వేశారని ప్రగతిశీల మహిళా సంఘం నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, చమురు ధరలను నిరసిస్తూ ఖాళీ సిలిండర్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంటగ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి దేశ ప్రజలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంచించింది అన్నారు. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన బీజేపి ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు 450 నుండి 1100 రూపాయలకు పెంచారని విమర్శించారు. పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సురేష్, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ కమ్మర్ పల్లి మండల కార్యదర్శి బి.అశోక్, సంయుక్త మండలాల కార్యదర్శి జి.కిషన్, కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు వి.బాలయ్య, ఎస్.లక్ష్మి, వి.రాధా, కే. భానుచందర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నిజామాబాద్ సిటీ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ :కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడానికి నిరసిస్తూ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్ లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 2014లో యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్యాస్ ధర 400, పెట్రోల్ లీ. ధర 65, డీజిల్ 50 ఉందన్నారు.. అయినా పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరల తగ్గింపుకై 2014 ఎన్నికల సమయంలో బీజేపీ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు స్మృతి ఇరానీ చీర, గాజులు పంపిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని ఓట్లు దండుకున్నారన్నారు. కానీ గత 11 ఏళ్ళుగా అధికారంలో ఉన్న బీజేపీ మోడీ ప్రభుత్వం 400 గ్యాస్ ధరను వెయ్యి రూపాయలు దాటించిందన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్‌ఆయిల్ ధరలు విపరీతంగా తగ్గినా, పెట్రోల్, డీజిల్ ధరలను సెంచరీ దాటించిందన్నారు. రాష్ట్రాలకు దక్కాల్సిన సెస్సు పన్నును కూడా కేంద్రం దోచుకుంటుందని ఆరోపించారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలే కాకుండా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను 50 శాతం పైగా తగ్గించాలని, నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, టియుసిఐ జిల్లా నాయకుడు విటల్, గంగాధర్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు మహిపాల్, పీఓడబ్ల్యు నాయకులు నర్సక్క, సునంద, అమూల్య లలిత, సరస్వతి, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్

పోలీసులు గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కుప్కల్ గ్రామ శివారులో ఇసుక లోడ్ తో వస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. భీంగల్ కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు సిర్సు రాములు, వేముల ప్రశాంత్‌కు ఇసుకకు సంబంధించిన పత్రాలు అడుగగా చూపించలేదు. దీంతో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ లను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
శుక్రవారం | ఏప్రిల్ 11, 2025 | www.navatelangana.com

ధోతి గ్రామంలో విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలో ధోతి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిరం యొక్క విగ్రహ ప్రతిష్టాపన, శిఖర స్థాపన కార్యక్రమం అంగరంగ వైభోగంగా గ్రామస్తులంతా కలిసి గురువారం నిర్వహించారు. ఈ ప్రతిష్టాపన కార్యక్రమాలు శ్రీశ్రీ 108 మల్లికార్జున స్వామి ఖాత్గావ్, శ్రీ శ్రీ 108 మల్లికార్జున స్వామి కౌలాస్ పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు, భక్తులు, యువకులు, తదితరులు పాల్గొనారు.

జగదాంబా ఆలయానికి విరాళం



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కొయ్య గుండు తండాలో గిరిజనుల ఆరాధ దైవమైన జగదాంబ సేవాలాల్ ఆలయ నిర్మాణాల కోసం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ రూ.20 వేలు విరాళం గురువారం అందించారు. కోయ గుండు తండాలో సంతు సేవాలాల్ జగదాంబ ఆలయ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హమ్రియా నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ ఫుల్ సింగ్, రవి నందియా నాయక్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికే కొనుగోలు కేంద్రాలు

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్

నవతెలంగాణ-విలేకరుల బృందం

నాగిరెడ్డిపేట్ : మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. గురువారం మండలంలోని వదలపర్తి, మాల్ తుమ్మెద, పోచారం, బంజారా, ధర్మ రెడ్డి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ మహిళా సంఘాల ద్వారా జిల్లాలో 183, నాగిరెడ్డిపేటలో 11 కేంద్రాలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరాంరెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఏపీఎం జగదీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్ర రెడ్డి, పోచారం గ్రామ అధ్యక్షుడు కిరణ్, మండల యూత్ అధ్యక్షుడు శ్రీరామ్‌గౌడ్, సిసి దత్తు, గోపాల్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : మండలంలోని గూడెం, తిమ్మాకపల్లి, కోటాల్‌పల్లి మూడు గ్రామంలో ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీరాజగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలం ప్రెసిడెంట్ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పిఏసి ఎస్ వైస్ చైర్మన్ శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు బాల్ రాజు, రమేష్, స్వామి గ్రామ రైతు లు, గ్రామ సంఘం మహిళలు, సీసీ అంజగౌడ్, ఏఇవో ప్రతిమ, పంచాయతీ కార్యదర్శి సంగీత, వీవోఏలు కవిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగించువాలని విండో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిబిపేట సొసైటీ పరిధిలోని అంబారీపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు విక్రయించాలన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, వినీత్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

తాడ్వాయి : ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డిలు ప్రారంభించారు. సోమారం, చిట్యాల, బ్రహ్మాజీవాడి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గైని శివాజీ, మేకల రాజు, బండారు సంజీవ్, పైడి రాజేశ్వర్ రెడ్డి, సంతాజి గారి సుధాకర్ రావు, మహమ్మద్ చౌకత్, మెట్టు రామచంద్రం, కాట్రోత్ చందర్, ఏపిఎం మనోహర్, సీసీలు పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని పోసానిపేట్, కన్నాపూర్‌లో సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, మద్దికుంట, గొడుగు మర్రి తాండ, గోకుల్ తాండలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో ప్రసన్నకుమార్, ఏవో భాను శ్రీ, వైస్ చైర్మన్ పశు పతి, దశరథ్‌రెడ్డి, లక్ష్మా గౌడ్, ప్రవీణ్ గౌడ్, సీసీలు భూమాగౌడ్, శ్రీనివాస్, ఏఈఓ శ్రీనివాస్, వివోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రేణుక చావన్, ఎంపీడీవో రాజేశ్వర్‌లతో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఏటీఎ గంగరాజు, ఆర్ఐ ప్రదీప్, మాజీ ఎంపీటీసీలు కామిల్లి బాలరాజ్, పత్తి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మని బాలయ్య, నాయకులు, పాల్గొన్నారు.





నాగిరెడ్డిపేట్: మహిళ సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు.. దోమకొండలో..



తాడ్వాయిలో...



గాంధారిలో...

దొంగతనానికి పాల్పడ్డ మహిళ

- పట్టుకున్న గ్రామస్తులు



మహిళ దగ్గర దొరికిన ఆభరణాలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజీ వాడి గ్రామంలో దొంగతనాలు చేసిన మహిళను గ్రామస్తులు పట్టుకున్నట్టు కున్నారు. గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన రామ్‌రెడ్డి ఇంట్లో ఎవరు లేనిది అదును చూసి ఇంట్లోకి చొరబడి 20 తులాల వెండి పట్టీలు దొంగిలించి, మరో మహిళ వద్దకు వెళ్లి మాయ మాటలు చెబుతూ చెవులకు ఉన్న బంగారు గెంటీలు తీసే ప్రయత్నం చేయగా మహిళలు గ్రామస్తులు గమనించి పట్టుకొని చితక బాధారు. ఈమే మండల కేంద్రానికి మహిళగా గురించారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు తెలుపగా ఆమేను అదుపులోకి తీసుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

కల్తీ కల్లు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎన్‌హెచ్‌ఆర్‌సి జిల్లా అధ్యక్షులు వడ్ల సాయికృష్ణ విజ్ఞప్తి

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో కల్తీకల్లు దుకాణాల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) కామారెడ్డి జిల్లా అధ్యక్షులు వడ్ల సాయికృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి జిల్లాలోని నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో కల్తీ కల్లు బాధితుల సంఖ్య సుమారు 64కు చేరిందని, ఇందులో కొంతమంది ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. నిషేధిత మత్తు పదార్థాలు కల్లులో కలపడంతోనే బాధితులు అస్వస్థకు గురైనట్టు తెలుస్తున్నదని తెలిపారు. ఈ విషయంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ విభాగం అధికారులు, వైద్య శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అట్టి కల్తీ కల్లు దుకాణాలను సీజ్ చేయాలని, నిందితులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఒక సమగ్ర రిపోర్టు పంపనున్నట్టు తెలిపారు.

కర్షక మిత్రలోన్‌పై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిసిసి బ్యాంక్ మేనేజర్ జయశ్రీ

నవతెలంగాణ-సదాశివనగర్

ఎన్‌డిసిసి బ్యాంక్ మేనేజర్ గాండ్ల జయశ్రీ కర్షక మిత్ర లోన్‌పై రైతులకు అవగాహన గురువారం కల్పించారు. రైతులు వ్యవసాయ భూమిని మార్టిజ్ చేస్తే రుణాలు ఇస్తామని తెలిపారు. రైతుకు ఎన్‌డిసిసి బ్యాంకు నుంచి నేరుగా ఋణం తీసుకోవచ్చని తెలిపారు. ఒక ఎకరానికి రెండున్నర లక్షల నుంచి 12 లక్షల వరకు రుణం తీసుకోవచ్చన్నారు. రుణంపైన 12 శాతం వడ్డీ ఉంటుందని తెలిపారు. ఈ డబ్బులను ఆరు నెలలకు ఒకసారి చెల్లించాలని సూచించారు. 10 కిస్తీలు చెల్లించాలని అన్నారు. ఐదు సంవత్సరాల వరకు చెల్లించాలని తెలిపారు. కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా రుణాలు ఇస్తామన్నారు. బ్యాంకులో హౌసింగ్ లోన్, గోల్డ్ లోను ఇస్తామని తెలిపారు, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గంట్యాల కిరణ్, గోప నవీన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- బాన్స్‌వాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని సౌభాగ్యవతి



చేతులు శుభ్రంగా కడుగుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని సౌభాగ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు,

నవతెలంగాణ-పిట్లం

చిన్నారుల ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ వహిస్తూ ఎప్పటికప్పుడు చేతులను శుభ్ర పర్చుకోవాలని బాన్స్‌వాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని సౌభాగ్యవతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐదవ అంగన్వాడీ సెంటర్‌లో చిన్నారులకు ఐ క్యాంప్, ఎనిమియా, స్పెషల్ గ్రోత్ డ్రైవ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఆరోగ్య పరిరక్షణకు గాను పౌష్టికాహారం అందజేస్తూ, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్ రేణుక, ఆర్‌బిఎస్‌కే డాక్టర్ అర్జున్, ఏఎన్ఎం చంద్రకళ, అంగన్వాడీ టీచర్లు జంగం సుమలత, ప్రవీణ, కుమ్మరి రాధా, శోభ, ఆశా వర్కర్ కుమారి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసమే కమిటీలు

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసమే కులాల వారిగా గ్రామ కమిటీలు వేస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని సజనపల్లి, శెట్‌పల్లి, గ్రామాలలో ఎస్సీ, బీసీ గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆదేశానుసారం ఎన్నుకున్నారు. శెట్టిపల్లి ఎస్సి సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాలయ్యను ఎన్నుకున్నారు. నియమాకపత్రం అందజేశారు. సజనపల్లి గ్రామంలో బీసీ, ఎస్సీ కమిటీలను ఎన్నుకున్నారు. బీసీ కమిటీలు ఎస్సీ కమిటీలు బాధ్యతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు దర్శనం సాయిలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొలగరి రాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు సిద్ధ రాములు, కృష్ణగౌడ్, శ్రీనివాస్, ఈర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్ స్థల పరిశీలన

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని సోంపూర్ గ్రామ శివారులోని పిఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ భూమిని (చట్టం 15.15) గ్రా.ల విస్తీర్ణంలో, ఎస్సీ, బీసీ, ఎస్టీ మైనారిటీల కోసం, టిజిఇవిఐడిసి సిబ్బందితో కలిసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న స్థల సేకరణకు హాజరైనట్టు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. కార్యక్రమములో డిఇ సుబ్బా రాయుడు, ఎఇ నాగేశ్వర్ రావు, సర్వేయర్, మాజి జెడ్‌పిటిసి శంకర్, మాజీ సర్పంచ్ సోంపూర్ పాల్గొన్నట్లు తహశీల్దార్ గంగాధర్ తెలిపారు.

మెడికల్ కళాశాలలో..

అక్రమ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను రద్దు చేయాలి

- అభ్యర్థులందరి ఒరిజినల్ సర్టిఫికెట్లను బహిరంగ విచారణ చేయాలి
- అక్రమ నియామకాలపై కమిషన్ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలి
- కామారెడ్డి విద్యార్థి సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మెడికల్ కళాశాలలో జరిగిన అక్రమ నియామకాలను వెంటనే రద్దు చేయాలని జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు అక్రమంగా జరిగాయని, మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వలేదని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదన్నారు. ఇదే విషయమై విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి నిరసనలు చేయడం జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టర్, ఉన్నతాధికారులకు విన్నవించిన చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండటమే దానికి నిదర్శనం అన్నారు. నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఉద్యోగాలు ఇచ్చారని, బలమైన కారణాలు ఉన్నప్పటికీ అభ్యర్థులు విన్నవించిన కలెక్టర్ స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఉద్యోగాలు పొందిన వారి సర్టిఫికెట్లను కమిషన్ ఏర్పాటు చేసి బహిరంగంగా వెరిఫై చేయాలని తెలిపారు. అప్లై చేసుకున్న నిరుద్యోగుల సర్టిఫికెట్లను కూడా వెరిఫై చేయాలన్నారు. వెంటనే అక్రమ నియమకాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బివియం రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్ కుమార్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సురేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జివిఎస్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, నిరుద్యోగులు రవి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా చేపట్టాలి

- అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్

నవతెలంగాణ-లింగంపేట్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండలంలోని ఎల్లారం పైలెట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మార్కౌట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ లబ్దిదారులు పనుల్లో జాప్యం జరగకుండా పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. బిల్లుల పంపిణీలో జాప్యం ఉండదని తెలిపారు. నాలుగు విడతలుగా బిల్లులు లబ్దిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులకు సమస్యలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీఓ మలహరి, కార్యదర్శి సిబ్బంది ఉన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మార్కౌట్‌లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలి

- ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ-భిక్కనూర్

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. గురువారం పట్టణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని విక్రయించిన వారం రోజుల్లో డబ్బులు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్, ఏఎంసి చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, సొసైటీ చైర్మన్ భూమయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ..



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

మండలంలోని జంగంపల్లి, పెద్దమల్లరెడ్డి, రామేశ్వర్‌పల్లి, బస్వాపూర్, లక్ష్మీ దేవునిపల్లి గ్రామాలకు చెందిన బాధితులకు గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలను ఆదుకుంటుందని సూచించారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, జిల్లా ఎన్నారై సెల్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్వోకు సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల ఎమ్మార్వోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉమాలతను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు శాలువాతో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మా గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శీలాసాగర్, మైనార్టీ మండల ప్రెసిడెంట్ ఇర్ఫాన్, గ్రామ అధ్యక్షులు రంజిత్, కిషన్ గౌడ్, లేగల ప్రసాద్, శ్రీశైలం, పుష్ప సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా కాపీ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గూగు ల్ తాండాకు చెందిన రైతు బాదావత్ జగ్గారం అనారో గ్యంతో మృతిచెందగా రైతు భీమా క్రింద రూ.5 లక్షలు వచ్చాయి. గురువా రం కాంగ్రెస్ నాయకులు బాధితురాలు ఇంటికి వెళ్లి పోసిటింగ్ కాపీని అంద జేశారు. మోహన్ నాయక్, సొసైటీ వైస్ చైర్మన్ పశుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్యనారాయణ, రావుఫ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మా గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్, పాల్గొన్నారు.